బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా నగరంలోని పలు నగల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 1 మే 2025 | HYDERABAD

ప్రతిష్టాత్మక యుధువీర్ ఫౌండేషన్ పురస్కారాన్ని బుధవారం రెడ్‌హిల్స్‌లోని కేఎల్ ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో తెలంగాణ చిత్రకారుడు తోట వైకుంఠానికి అందజేస్తున్న ఫౌండేషన్ చైర్ పర్సన్ అరుణా బహుగుణ

ఐపీఎస్‌ల కుతకుత.. బల్దియా లుకలుక

ఆర్‌వీ కర్ణన్ నియామకంతో మొదలైన కాక.. కమిషనర్ పోస్టింగ్‌పై సెలవుపై వెళ్లిన సీనియర్ ఐపీఎస్ అధికారి

ఇదే బాటలో మరో జూనియర్ ఐపీఎస్

ఇతర శాఖకు కానీ, కలెక్టర్‌గా అవకాశం కల్పించాలంటూ మరో ఇద్దరు జోనల్ ఐపీఎస్‌ల అర్జీలు

బల్దియాలో హాట్ హాట్‌గా మారిన ఐపీఎస్‌ల వ్యవహారం

16 నెలల్లో నలుగురు కమిషనర్లపై ఇప్పటికే జనం మండిపాటు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఇలంబర్తి స్థానంలో ప్రభుత్వం 2012 బ్యాచ్‌కు చెందిన ఆర్ వీ కర్ణన్‌కు బల్దియా బాధ్యతలు అప్పగించింది. ఆర్‌వీ కర్ణన్ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు తీసుకున్న సంగతి తెలిసిందే. జీహెచ్ఎంసీలో అప్పటికే సీనియర్ ఐపీఎస్ ఉండగా, జూనియన్ ఐపీఎస్‌కు కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వడంతో ఈ వివాదం రాజుకున్నది. జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఐపీఎస్ అధికారి కిల్లు శివకుమార్ నాయుడు 2011 బ్యాచ్‌నకు చెందిన వారు. అంటే ఆర్‌వీ కర్ణన్ కంటే ఏడాది సీనియర్..ప్రభుత్వాలు జూనియర్..సీనియర్ అనేది పరిగణనలోకి తీసుకోకుండా పోస్టింగ్ ఇవ్వడంపై అధికార వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. కనీసం శివ కుమార్ నాయుడును ఇక్కడి నుంచి మరో విభాగం సీనియర్ వద్దకు ప్రభుత్వం బదిలీ చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే శివకుమార్ నాయుడు సెలవులో వెళ్లడం ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వాస్తవంగా ఐపీఎస్, ఐపీఎస్‌లలో సీనియర్, జూనియర్ అనే బేధాభిప్రాయాలు సహజంగానే ఉంటాయని, ఒకే చోట కలిసి పనిచేయాల్సిన సందర్భం వచ్చినప్పుడు ఇలాంటివి బయట పడుతున్నాయని మరోసారి నిరూపితమైంది.

జీహెచ్ఎంసీలో కొత్త లొల్లి మొదలైంది. ఇప్పటికే ప్రజా సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్న బల్దియాపై పుండు మీద కారం చల్లినట్లు కమిషనర్ బదిలీ అంశం ఐపీఎస్‌ల్లో పెద్ద కుంపటిని రాజేసింది.

ఒకరికి పోస్టింగ్..మరొకరు వెయింటింగ్

జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లలో హాట్ సీటు ఏదైన ఉంది అని అంటే శేరిలింగంపల్లి మాత్రమే...ఐటీ దిగ్గజ కంపెనీలు, ఆకాశహర్మాలు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో ఈ పోస్టింగ్‌పై చాలా మంది ఆసక్తి చూపిస్తారు. అయితే శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపేందర్‌రెడ్డిని ఇటీవల ప్రభుత్వం హెచ్ఎండీఏ సెక్రటరీగా బదిలీ చేసింది. ఈ బదిలీల్లో భాగంగానే జీహెచ్ఎంసీకి ఐపీఎస్ అధికారి హేమంత్ సహదేవ్ రావును ప్రభుత్వం నియమించింది. అయితే హేమంత్ సహదేవ్‌రావుతో పాటు ఇటీవల మెటర్నటీ లీవ్‌ను పూర్తి చేసుకుని తిరిగి జీహెచ్ఎంసీలో జాయినింగ్ లెటర్ ఇచ్చిన మరో ఐపీఎస్ అధికారిణి స్నేహ శబరీష్‌కు బల్దియాలో బాధ్యతలు అప్పజెప్పాల్సి ఉండగా, బుధవారం సాయంత్రం సహదేవ్ రావు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. స్నేహ శబరీష్ బాధ్యతలు ఖరారు కావాల్సి ఉంది.

చార్మినార్ వద్ద పర్యటిస్తున్న బల్దియా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

జీహెచ్ఎంసీని వీడే యోచనలో ఐపీఎస్‌లు

ఆర్ వీ కర్ణన్ బాధ్యత స్వీకరణ సందర్భంలో శివ కుమార్ నాయుడు హాజరు కాకపోవడంతో చర్చకు దారి తీసింది.మరో ఐపీఎస్ అధికారి అనురాగ్ జయంతి సైతం సెలవు మీద వెళ్లడం, ఇందుకు కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ ఇద్దరితో పాటు జోనల్ కమిషనర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న మరో ఇద్దరు ఐపీఎస్‌లో బల్దియాలో పనిచేసేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి, ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్లు మాత్రం ఇతర శాఖలకు, కలెక్టర్లుగా వెళ్లాలన్న ప్రయత్నం చర్చ లేకపోలేదు. త్వరలో ప్రభుత్వం జరిపే కలెక్టర్ల బదిలీల్లో వీరి పేర్లు ఉంటాయన్న చర్చ కూడా మొదలైంది. ఉన్నట్టుండి బల్దియాను వీడుతుండడంతో ఇందుకు రాజకీయ ఒత్తిడిలు లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న చర్చకు జరుగుతున్నది.

పద్మారావునగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

బల్దియాను కాపాడేదెవరు?

రాష్ట్రంలోనే అత్యధిక జనాభా (సుమారు కోటి 20 లక్షల పైచిలుకు) అత్యవసర సేవలందిస్తున్న జీహెచ్ఎంసీలో పాలన గాడి తప్పిందా? ప్రజల మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందా? అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందా? అంటే వరుసగా జరుగుతున్న ఐపీఎస్‌ల బదిలీలను చూస్తే అవుననే అంటున్నది గ్రేటర్ ప్రజానీకం. 16 నెలల కాంగ్రెస్ పాలనలో ముగ్గురు ఐపీఎస్‌లు రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి, ఇలంబర్తిలను మార్చేసి ముచ్చటగా నాలుగో ఐపీఎస్‌గా ఆర్ వీ కర్ణన్‌ను నియమించారు. సహజంగా ఇతర శాఖలతో పోల్చితే బల్దియాలో 24 గంటలు అప్రమత్తంగా ఉండి సేవలందించాల్సి ఉంటుంది. ఆరు జోన్లలో ఆయా జోన్లకు అనుగుణంగా అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. వాస్తవంగా బల్దియా బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ ఐపీఎస్‌కు అయినా.. జీహెచ్ఎంసీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకుని పట్టు సాధించాలంటే ఆరు నెలల సమయం తప్పనిసరి..రెండేండ్ల వరకు కొనసాగిస్తే శాఖ పటిష్టత, సంస్కరణలు చేసి పౌర సేవలను మెరుగుపర్చే అవకాశాలు ఉంటాయి. కానీ ప్రజా పాలన ప్రభుత్వం 16 నెలల్లోనే ముగ్గురిని మార్చేసింది. కారణాలు ఏమైనా ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లోపించిందన్న ఆరోపణలు లేకపోలేదు.

సిటీ కమిషనరేట్‌లో.. 146 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు!

ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేస్తూ.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లు, జోన్లను, డివిజన్లను పునర్‌వ్యవస్థీకరిస్తూ.. నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ బదిలీలు జరగడంతో పోలీస్ కమిషనరేట్‌ను ప్రక్షాళన చేసినట్లయింది. నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 146 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. పునర్వ్యవస్థీకరణకు సంబంధించి బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో జోన్లు, డివిజన్లు, పీఎస్‌ల మార్పులతో పాటు బదిలీలకు సంబంధించి సీపీ నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ విభాగంతో పాటు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లను కూడా పెద్ద ఎత్తున బదిలీ చేయడం, ప్రతీ జోన్‌కు ఒక సైబర్ క్రైమ్ సెల్‌ను ఏర్పాటు చేసి.. వీటికి ఒక్కో ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సైబర్ విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని నగర కమిషనర్ పేర్కొన్నారు.

నార్త్ సిటీ.. ప్రగతి పిటీ

ప్రతిపాదనల పేరుతో ప్రభుత్వం కాలయాపన

గందరగోళంగా ఎలివేటెడ్, మెట్రో ప్రాజెక్టులు

ఇప్పటికీ పూర్తికాని మెట్రో డీపీఆర్, ఎలివేటెడ్ భూసేకరణ

భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): నార్త్ సిటీ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఆ ప్రాంతం తనకు రాజకీయ పునర్జన్మనిచ్చిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నీటి మూటలుగా మారుతున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అంటూనే రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దాదాపు 30 లక్షలకు పైగా జనాభా ఉన్న నార్త్ సిటీ ప్రాంతానికి తీరని అన్యాయం చేసేలా ఎలివేటెడ్ డబుల్ డెక్కర్, మెట్రో విషయంలో ప్రతిపాదనలను సర్కారు తారుమారు చేస్తున్నది. ఒకవేళ ఆయా ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించకపోతే నార్త్ సిటీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుకే ప్రమాదం పొంచి ఉంది.

'ఊహానగరం'పై ఉన్న ప్రేమ..

సీఎం రేవంత్ రెడ్డికి 'ఊహానగరం'పై ఉన్న ప్రేమ... నార్త్ సిటీపై లేకుండా పోయింది. రాజకీయ పునర్జన్మనిచ్చిన ప్రాంతానికి అన్యాయం చేసేలా రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన ఎలివేటెడ్ కారిడార్, మెట్రో నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా నార్త్ సిటీ ప్రజల సుదీర్ఘ కాలంగా తీరని ఆకాంక్షగా ఎలివేటెడ్ కారిడార్, మెట్రో మిగిలిపోయేలా ఉంది. ఈ విషయంలో ఇప్పటికీ భూ సేకరణ పూర్తి చేయకపోగా, తాజాగా మెట్రో నిర్మాణంలోనూ డీపీఆర్ పూర్తిచేయకుండా కొర్రీలు పెడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఒకే పిల్లర్‌పై రెండు రవాణా వ్యవస్థలను తీర్చిదిద్దాలని ప్రతిపాదనలకు తిలోదకాలు వదిలే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. నిర్ణీత గడువులోగా డీపీఆర్ పూర్తి చేయకుండా, అదేవిధంగా జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భూసేకరణ విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీసం స్థానికుల ప్రతిపాదనలు కూడా పరిగణనలోకి తీసుకోకుండా గ్రామ సభల పేరిట కార్యకలాపాలు నిర్వహిస్తున్నారే తప్ప ... చిత్తశుద్ధితో ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణకు సరైన నిర్ణయాన్ని తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇలా ప్రాజెక్టుల ఆశయాలను నీరుగారేలా చేసి నార్త్ సిటీ ప్రాంతానికి కాంగ్రెస్ సర్కార్ తీరని అన్యాయం చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

ఎలివేటెడ్‌పై వీడని చిక్కుముడి..

గేట్ వే ఆఫ్ నార్త్ తెలంగాణగా పిలిచే ప్రాంతానికి మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రాజెక్టుకు అవసరమైన రక్షణ శాఖ భూములను తీసుకునేలా కేంద్రంతో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అనేకసార్లు సంప్రదింపులు కూడా చేశారు. కేంద్రం భూముల విషయంలో బీఆర్ఎస్ చేసిన ప్రతిపాదనలను బుట్ట దాఖలు చేసింది.దాదాపు నాలుగున్నరేళ్ల పాటు తమకు రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని కోరిన ప్రయోజనం లేకుండా పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత ప్రతిపాదనలకి మళ్లీ అంగీకారం తెలుపుతూ రక్షణ శాఖ భూముల బదలాయింపుపై చర్యలు తీసుకుంది. ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ పడింది అనుకునేలోపే మరో తిరకాసుతో కొర్రీలు పెడుతూ భూ బదలాయింపును జాప్యం చేస్తున్నది. ఇలా ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తుండగా, భూ సేకరణ విషయంలో కూడా బాధితులతో సంప్రదింపులు చేయకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. దీంతో తమ వాదనలను పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదని, ప్రభుత్వం ప్రాజెక్టు వెడల్పు తగ్గిస్తే గాని భూములు ఇవ్వలేమని రాజీవ్ రహదారి స్థలాల జేఏసీ చెబుతున్నది. ఈ క్రమంలో ఎలివేటెడ్ కారిడార్ విషయంలో తమకు నష్టం జరగకుండా కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇలా సామరస్యంగా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును సర్కారు వివాదాస్పదం చేసింది.

చెరోదారిలో ఎలివేటెడ్, మెట్రో ప్రాజెక్టులు..

ఒకే ప్రాజెక్టు ద్వారా ఎలివేటెడ్, మెట్రో రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశారు. రెండు మార్గాల్లో 18 కిలోమీటర్ల పొడవైన ఒకే పిల్లర్ పై రెండు రవాణా వ్యవస్థలు ఏర్పాటు చేయడం వల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు, భూసేకరణ భారం కూడా తగ్గుతుంది. ఇలా బృహత్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్‌కి ప్రణాళికలు రూపొందించింది. దీనికి అనుగుణంగానే నిర్మాణానికి ఏర్పాట్లు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలివేటెడ్ కారిడార్ విషయంలో కొర్రీలు పెడుతూ ఆ ప్రాజెక్టును రెండుగా విడదీసి నార్త్ సిటీ ప్రయోజనాలకు గండి కొట్టాలని భావిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీలైనంత త్వరగా ఎలివేటెడ్ కారిడార్, మెట్రో పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎలివేటెడ్ కారిడార్ నమూనా చిత్రం

లక్ష్యం చేరుకోని ఎర్లీబర్డ్

టార్గెట్ రూ.1000 కోట్లు.. వసూలైంది రూ.891.52 కోట్లే

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.1000కోట్ల పన్ను వసూలు చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోలేదు. ఎర్లీ బర్డ్ స్కీం ఆఫర్‌ను ఇళ్లు, వ్యాపార సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు గడిచిన 30 రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బుధవారం రాత్రి వరకు బల్దియా రూ.891.52 కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకున్నది. చివరి రోజు ఒక్క రోజే రూ. 93.33 కోట్ల మేర ఆదాయం వచ్చింది. గతేడాది మొత్తం ఆదాయం రూ. 831 కోట్లు కాగా, ఈ సారి అదనంగా రూ. 60 కోట్ల మేర రాబట్టారు. అర్ధరాత్రి 12 గంటల వరకు జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీసులు, సిటిజన్ సర్వీస్ సెంటర్లు తెరిచి ఉంచారు. ఎర్లీబర్డ్ ఆదాయం గురువారం ఉదయం వరకు సమగ్రంగా వెల్లడవుతుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్ఆర్‌డీపీ పనులు వేగవంతం చేయండి

క్షేత్రస్థాయి పర్యటనలో బల్దియా కమిషనర్ ఆదేశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఆరాంఘర్ ఫ్లై ఓవర్ అప్ డౌన్ ర్యాంపుల నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఆరాంఘర్ నుంచి జూ పార్కు వరకు చేపట్టిన ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు, శాస్త్రిపురం ఆర్వోబీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు కమిషనర్ ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో చార్మినార్‌ను పర్యాటకులు వీక్షించే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, ప్రాజెక్టు ఈఈ బీఎల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో వైపు నగరంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడంతో ఎండలు మండిపోతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 40, కనిష్ఠం 27 డిగ్రీలు, గాలిలో తేమ 21శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

కేబీఆర్ పార్క్.. పెండింగ్ మార్క్

న్యాయపరమైన చిక్కుల్లో కేబీఆర్ పార్క్ ప్రాజెక్ట్

తాజాగా మరో రెండు పిటిషన్లు

కోర్టులను ఆశ్రయిస్తున్న భూ బాధితులు

నాలుగు నెలలుగా పెండింగ్‌లో ప్రాజెక్ట్

టెండర్లు పిలిచిన అధికారులపై విమర్శల వెల్లువ

కేబీఆర్ పార్క్ విహంగ వీక్షణం

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేబీఆర్ పార్క్ ప్రాజెక్టు పనులు 'ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారుతోంది. పర్యావరణ పరంగా అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారంగా రూ. 1090 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులకు గతేడాది డిసెంబర్ నెలలో జరిగిన ప్రజా పాలన ఏడాది విజయోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన అధికారులు గడిచిన నాలుగు నెలలుగా పనుల్లో ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఈ ప్రాజెక్టుకు ముందు నుంచి సరైన ప్రణాళిక లోపించింది. భూ సేకరణపై విధి విధానాలు రూపొందించకపోవడం, కేబీఆర్ పార్కు చుట్టూ సినీ, రాజకీయ ప్రముఖులు ఉండడం భూ సేకరణపై ఎలాంటి స్పష్టత లేకుండా ముందుకు సాగారు. ఫలితంగా క్షేత్రస్థాయిలోకి దిగిన అధికారులకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ ప్రాజెక్టును ఇప్పటికే వ్యతిరేకించి కేబీఆర్ పార్క్ విస్తరణ ప్రాజెక్టులో తన ఇంటిని సంరక్షించాలని కోరుతూ ప్రజావాణిలో దరఖాస్తు చేసిన కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి.. తాజాగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వాన్ని నిలువరించేలా, పర్యావరణాన్ని పెంపొందించాలని ఎన్జీటీలో నమోదైన కేసు పెండింగ్‌లో ఉంది. తాజాగా ఆ పార్టీ నేతకు తోడుగా ఓ న్యూస్ యాజమాన్యం, బసవ తారకం క్యాన్సర్ దవాఖాన సమీపంలో మరో యాజమానులు వేర్వేరుగా న్యాయస్థానం మెట్లు ఎక్కారు. దీంతో రోజురోజుకు న్యాయపరమైన చిక్కుల్లో కూరుకుపోతున్న ఈ ప్రాజెక్టు ఇప్పట్లో మొదలు కావడం కష్టంగానే ఉందని అధికార వర్గాలు చెబుతుండటం గమనార్హం.

భూసేకరణపై కోర్టు చిక్కులు..

బంజారాహిల్స్ రోడ్ నం 12 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు భూసేకరణలో భాగంగా గతంలోనే పలు భవనాలకు మార్కింగ్ వేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 92లో నివసించే మాజీ మంత్రి జానారెడ్డి రోడ్డు విస్తరణలో భాగంగా తన స్థలంలో 266 గజాల స్థలాన్ని కోల్పోనున్నారు. ఆయన ఇంటికి వేసిన మార్కింగ్ ప్రకారం ఆయన ప్లాట్‌లో సగ భాగం విస్తరణలో కోల్పోనుంది. ఇక జూబ్లీహిల్స్ రోడ్ నం 45లో ఉన్న హీరో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటికి కూడా మార్కింగ్ వేశారు. సుమారుగా తన ప్లాట్‌లో 377 గజాల వరకు కోల్పోనున్నారు. ఈ రహదారి విస్తరణలోనే మరికొంత మంది ప్రముఖులు ఉన్నారు. మాజీ మంత్రులు

మిగతా IVవ పేజీలో